క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం పట్టణంలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మైంటెనెన్స్ కారణంగా శుక్రవారంభీమవరం పట్టణ, భీమవరం రూరల్, పాలకోడేరు, వీరవాసరం మండలాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

ఆకివీడులో..

ఆకివీడు: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ లైన్లు మరమ్మతులు, ట్రీ కటింగ్ కోసం శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సమతానగర్, అజ్జమూరు, గుమ్ములూరు ఫీడర్లు, ఇండస్ట్రీయల్ ఏరియా, చెరుకువాడ ఆక్వాఫీడర్ లైన్లలో సరఫరా నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ఆకివీడు రూరల్ పరిధిలో కోళ్లపర్రు సబ్ స్టేషన్‌లోని కోళ్లపర్రు, అప్పారావుపేట, రామయ్యగూడెం, గుమ్ములూరు, రాజులపేట, పెదకాపవరం, గంటలరాయుడుపేట, కవిటంపాకల, అర్తమూరు గ్రామాల్లోని ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్ఐకి సివిల్ సప్లయిస్ డీటీ బాధ్యతలు

ఆకివీడు: స్థానిక రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వంటపాటి ఆంజనేయులకు గురువారం మండల సివిల్ సప్లయిస్ డీటీ బాధ్యతలను జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి కేటాయించారు. మండలంలోని రేషన్ పంపిణీ విధానం, సరఫరా తదితర అంశాలపై ఆయన పర్యవేక్షణ చేస్తారని తహసీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు.

మావుళ్లమ్మకు విశేష పూజలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారికి శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ అన్నారు. గురువారం అమ్మవారి ఆలయంలో శ్రావణ శుద్ధ సప్తమి, చిత్త నక్షత్రం సందర్భంగా ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ప్రత్యేక దీపార్చన కార్యక్రమం నిర్వహించారన్నారు. అనంతరం భక్తులు నిత్యదీపాలు వెలిగించి అమ్మవారి దర్శనం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

భీమవరం: భీమవరం పట్టణంలోని జిల్లా విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో గురువారం ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరాన్ని విశ్వహిందూ పరిషత్ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు వబిలిశెట్టి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో కంప్యూటర్ శిక్షణ ప్రతి ఒక్కరికీ అత్యంత అవసరమన్నారు. కంప్యూటర్ శిక్షణ పొందిన గృహిణులు సైతం ఇంటి వద్ద నుంచే పార్ట్ టైం ఉద్యోగాలతో ఉపాధి పొందవచ్చన్నారు. ఉచిత శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి శేఖర్, సీతారామరాజు, సుశాంత్ సుబ్రహ్మణ్య వర్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

భీమవరం: మానవత సంస్థ స్వచ్ఛంద సంస్థ భీమవరం శాఖ ఆధ్వర్యంలో గురువారం సంస్థ మాజీ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ ఇంటివద్ద గురువారం వికలాంగులు, పేద వృద్ధులకు, హెచ్.ఐ.వి బాధిత కుటుంబాల పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రామ్మోహనవర్మ తన తండ్రి లక్ష్మీపతిరాజు పేరున సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం సుమారు 80 మంది పేదలకు దుస్తులు, భోజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్మెత్స సత్యవెంకటరాజు, అల్లూరి బంగ్రాజు జయలక్ష్మి, ఇందుకూరి రామలింగరాజు, చింతలపాటి రామకృష్ణంరాజు, కార్మూరి బాబు, ఇందుకూరి ప్రసాదరాజు, గ్రంధి ప్రసాద్, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చినమిల్లి పరామర్శలు



రాయలంలో కొమ్మాజీ మణికంఠను పరామర్శిస్తున్న చినమిల్లి వెంకట్రాయుడు

భీమవరం అర్బన్: మండలంలోని రాయలంలో గ్రామంలో గురువారం కొమ్మాజీ మణికంఠను గురువారం భీమవరం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకట్రాయుడు పరామర్శించారు. ఇటీవల కొమ్మాజీ విశ్వేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మణికంఠను పరామర్శించి అధైర్య పడవద్దని మేమంతా అండగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు చినిమిల్లి వెంకటరామయ్య (బాబి), వీరిన ప్రసాద్, అరుపాక రాంబాబు, లంక శ్రీను, పెద్దపాటి నాగేశ్వరరావు, గాజుల ప్రసాద్, మోకా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కానరాని స్వచ్ఛత



కాళ్ల కాలనీలో రోడ్డుపైకి వస్తున్నమురుగు నీరు



కాళ్ల పల్లపు వీధిలో దుస్థితి



దొడ్డనపూడి హరిజనపేటలో రోడ్లపై వస్తున్న మురుగునీరు



కాళ్ల తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న మురుగు నీరు

- ఎక్కడ చూసినా మురుగునీరే
- పట్టించుకోని అధికారులు

కాళ్ల: మండలంలో పలు గ్రామాల్లో ప్రజలు మురుగుతోనే సహవాసం చేస్తున్నారు. రోడ్లపై ఎక్కడ చూసినా మురుగునీరే ఉండడంతో దుర్గంధంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు సైతం అటువైపు చూడకపోవడంతో పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో ఎవరికి వారే నిర్లక్ష్యంగా ఇళ్లల్లో వాడే వాడకం నీరు రోడ్లపైకి వదిలేయడంతో ఈ పరిస్థితులు వస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. కనీసం నాయకులు గానీ, అధికారులు గానీ పట్టించుకుని రోడ్లపైకి నీరు వదలకుండా చర్యలు కూడా తీసుకోకపోవడంపై ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు వల్ల దోమల ప్రబలి వ్యాధులు బారిన పడుతున్న కనీసం బ్లీచింగ్ కూడా చల్లించని దయనీయ పరిస్థితి గ్రామాల్లో నెలకొంది. మండలంలో ప్రధానంగా దొడ్డనపూడి, గ్రామంలోని హరిజనపేటలో మురుగునీరు రోడ్లపైకి వచ్చి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాళ్లకూరు గ్రామంలో రాష్ట్ర రహదారిని ఆనుకుని ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడులేడు. ఎల్.ఎన్ పురంతో పాటు పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

మురుగుతో నిత్యం నరకం

మండలం కేంద్రమైన కాళ్ల గ్రామంలో ఎక్కడపడితే అక్కడ మురుగు నీరే దర్శనమిస్తుంది. గ్రామంలో రాష్ట్ర రహదారి, పల్లపు వీధి, సినిమా హాల్ సెంటర్, కొత్తపేటతో పాటు ఆఖరికి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇదే పరిస్థితి కనిపిస్తూ ఉంటుంది. ఎవరికి వారే వాడకం నీళ్ల పైపుల ద్వారా బయటికు వదిలేస్తున్నారు. ఈ మురుగునీటిలోనే ప్రయాణం చేస్తున్నారు తప్ప ఏ ఒక్కరూ బాధ్యత వహించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇళ్లల్లో వాడకం నీరు పైపుల ద్వారా బయటకు వదిలేస్తున్నట్లు కళ్ళకి కట్టినట్టు కనిపిస్తున్నా ఏ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. దోమల ప్రబలి వ్యాధులు వస్తున్నా కనీసం బ్లీచింగ్ కూడా చల్లటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

> **మురుగు నిల్వ లేకుండా చర్యలు**
>
> గ్రామంలో మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అందరికీ నోటీసులు అందజేశాం. మురుగునీరు బయటకు వదలకుండా తగు చర్యలు తీసుకుంటాం. స్థానికులు కూడా సహకరించాలి. ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లి దోమల ప్రబలకుండా చర్యలు తీసుకుంటాం.
>
> – సతీష్, కాళ్ల పంచాయతీ కార్యదర్శి



అర్తమూరులో ఆర్అండ్‌బీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

బురదతో అవస్థలెన్నో..!

ఉండి: ఇంటి నుంచి అడుగు రోడ్డుపై వేయాలంటే తప్పనిసరిగా బురదలో కాలు వేయాల్సిందే అన్నట్టుంది అర్తమూరులో ఆర్అండ్‌బీ రోడ్డు పరిస్థితి. స్థానికులు ఎంత మొరపెట్టుకున్నా రోడ్డు ఎంత అధ్వానంగా మారిపోతున్నా అధికారుల్లో మాత్రం చలనం ఉండడం లేదు. చెరుకువాడ,అర్తమూరు శివారు కవిటంపాకల నుండి ఉండి ఉప్పుగుంట మీదుగా ఉండి వెళ్ళే ఈ రోడ్డు రోజురోజుకూ శిథిలావస్థకు చేరుకుంటుంది. రోడ్డుపై రోజుల తరబడి వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అలాగే మండలంలోని చెరుకువాడ, ఉండి శివారు ఉప్పుగుంట, కవిటం పాలక రోడ్డుతో పాటు మండలంలోని పలు రోడ్లు అధ్వాన స్థితికి చేరుకున్నా ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం కార్యాలయాలకే పరిమితమైపోయారని ఆరోపిస్తున్నారు.

లైన్‌మేన్‌పై కొనసాగుతున్న విచారణ



అర్తమూరులో విచారణ చేస్తున్న విద్యుత్ అధికారులు

ఉండి: మండలంలోని అర్తమూరు, చెరుకువాడ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ లైన్‌మేన్ దాసరి రాజుపై అవినీతి ఆరోపణలు రావడంతో గురువారం అధికారులు రంగంలోకి దిగారు. ఉదయం నుంచి విద్యుత్ శాఖ అధికారులు గ్రామంలోని పలువురు ఆక్వారైతుల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. విద్యుత్ బిల్లుల్లో తేడాలు, మీటర్ రీడింగ్‌లో వ్యత్యాసాలపై వారిని ఆరా తీశారు. అయితే మరికొంత మంది ఆక్వా రైతులను విచారించాల్సి ఉందని శుక్రవారం విచారణ చేపడతామని తెలిపారు. దీనిపై రైతులు చెప్పిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో సమర్పిస్తామని ఏఈ పులగం శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో రఘునాథ్‌బాబు, ఎస్ఈ, డీఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్ కళాశాల హాస్టల్‌పై అసత్య ఆరోపణలు వద్దు



భీమవరంలో డీఎన్నార్ కళాశాల హాస్టల్ వార్డెన్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల బాలుర హాస్టల్ సదుపాయాలపై ఏబీవీపీ విద్యార్థి సంఘం చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని కళాశాల హాస్టల్ విద్యార్థులు గురువారం కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజుకు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో హాస్టల్ వార్డెన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పాండురంగరాజును కలసి హాస్టల్ వసతులపై ఏబీవీపీ అసత్య ఆరోపణలు చేసిందని కళాశాల వద్దకు వచ్చిన ఏబీవీపీ నాయకులు మాయమాటలతో హాస్టల్ విద్యార్థులను కళాశాల గేటు వద్ద కూర్చోబెట్టి భోజనంలో నాణ్యతలేదు, తాగునీటి ఇబ్బందులంటూ మాట్లాడారని, అయితే హాస్టల్‌లో అన్నిరకాల సదుపాయాలున్నాయని చిన్న చిన్న సమస్యలను కళాశాల యాజమాన్యం పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. ఉపాధ్యక్షుడు పాండురంగరాజును కలసిన వారిలో కె హర్షవర్ధన్, టి రాకేష్, వై నిఖిల్, కె సందీప్, వి నర్సింహ, టి రవికుమార్ తదితరులున్నారు.

పోలీసు శాఖలో ఉద్యోగం సవాల్‌తో కూడుకున్నది



పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: పోలీసుశాఖలో పనిచేయడం సవాల్‌తో కూడుకున్నదని క్షమశిక్షణకు మారుపేరైన పోలీసు శాఖలో సుదీర్ఘకాలం బాధ్యతాయుతంగా పనిచేసి ఎటువంటి రిమార్క్ లేకుండా పదవీ విరమణ చేయడం అభినందనీయమని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. గురువారం పదవీ విరమణ చేసిన భీమవరం మహిళా పోలీసుస్టేషన్ ఎస్ఐ ఎస్‌వీవీ నాగేశ్వరరావు, తణుకు పోలీసు స్టేషన్ ఏఎస్ఐ బి పోలయ్యకాపు, తాడేపల్లిగూడెం పోలీసుస్టేషన్ ఏఎస్ఐ పీవీకే దుర్గారావులను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పదవీ విరమణ అనంతరం ఆర్థిక క్రమశిక్షణతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో సంతోషకరమైన జీవితాన్ని గడపాలని అద్నాన్ నయీం అస్మి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) వి భీమారావు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం సత్యనారాయణ, భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి పుల్లారావు, డీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్ డి వెంకటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అహ్మదున్నీషా తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ తీరుపై కౌన్సిలర్ల ధ్వజం

ఇష్టారాజ్యంగా నిధుల కేటాయింపుపై మండిపాటు



ఆకివీడు నగర పంచాయతీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ఆకివీడు: ఆకివీడు నగర పంచాయతీ కమిషనర్ తీరుపై కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. స్థానిక నగర పంచాయతీ సమావేశ హాలులో గురువారం సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో అజెండాకు తీసుకువచ్చిన 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.49,25,963 లక్షలను ఇష్టానుసారం కేటాయింపులు చేయడంపై కమిషనర్‌ను కౌన్సిలర్లు నిలదీశారు. మేము అసలు కౌన్సిలర్లమేనా? నిధుల వినియోగం గురించి ఎందుకు తెలియజేయడం లేదు? అని మండిపడ్డారు. సమావేశ అజెండాను ఐదు రోజుల ముందుగా ఎందుకు ఇవ్వడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ దీనికి సమాధానం చెప్పాలని సభ్యులు నిలదీశారు. రూ.49లక్షల్లో రూ.05 లక్షలు సీహెచ్‌సీ వద్ద రోడ్డు నిర్మాణానికి, మరో రూ.20 లక్షలు శ్మశాన వాటిక రోడ్డుకు, మరో రూ.13,27,444లు రూరల్ బ్యాంక్ వద్ద రోడ్డుపై రోడ్డు నిర్మాణానికి కేటాయించడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సీహెచ్‌సీలో రోడ్డు నిర్మాణానికి నగర పంచాయతీకి సంబంధం ఏంటి? అని వాళ్లకు గ్రాంటు వస్తుందని, పట్టణంలో ప్రజలు అధికంగా తిరుగుతున్న పలు చోట్ల బురద, మట్టి రోడ్లు నిర్మాణానికి ఎందుకు కేటాయించలేదని నిలదీశారు. నగర పంచాయతీకి ఎన్ని నిధులు వచ్చినా ఆ మూడు వార్డులకేనా అంటూ కొంత మంది కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. మైక్రో ఫిల్టర్ ఏర్పాటుకు రూ.15 లక్షలు కేటాయించారు. మంచినీటిసమస్యపై తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం చైర్‌పర్సన్ హైమావతి మాట్లాడుతూ సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఒక వార్డులోని సమస్యను మరొక వార్డు కౌన్సిలర్ కలగజేసుకోకూడదన్నారు. సమావేశంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు మోటుపల్లి కుమారి, నిమ్మల నాగు, గేదల అప్పారావు, తిరుమానేని మాధవి, అబ్రపున్నీస్సా బేగం, కట్టారవి, దొడ్డి జగదీష్, కటికతల జాన్‌వెస్లీ, జిల్లా రాజు, నేరెళ్ల ప్రసన్న, బొల్లా శ్వేత, గుర్రాని నాగలక్ష్మి,కోఆప్షన్ సభ్యులు మన్నే లలితాదేవి, ఎండీ జక్కీ, గుండుగొలను సావిత్రి, కమిషనర్ జి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో రోడ్డు వద్దని నిరసన



పాములపర్రులో నిరసన తెలుపుతున్న దళితులు

ఉండి: శ్మశానవాటికలో రోడ్డు వేయవద్దంటూ మండలంలోని పాములపర్రు గ్రామంలో దళితులు గురువారం నిరసనకు దిగారు. గ్రామానికి చెందిన దళితులు తరతరాలుగా ఉండి గణపవరం రోడ్డు పక్కనే వంతెన వద్ద నిర్వహించుకుంటున్న శ్మశానవాటికను ఆనుకుని ఉన్న కొందరు ఆక్వారైతుల కోరిక మేరకు శ్మశానం మీదుగా 20 అడుగుల రోడ్డు వేసేందుకు ప్రజాప్రతినిధులను కోరారు. దీంతో అధికారులు గత కొద్ది రోజుల నుండి సర్వే పనులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్వేను దళితులు అడ్డుకుని గురువారం టెంట్ వేసి నిరసనకు దిగారు. సదరు సమాచారం అందుకున్న పోలీసులు ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు నిరసనకు అనుమతి లేదని వెంటనే టెంట్లు తొలగించాలని నిరసన తెలుపుతున్న వారిని చెదరగొట్టారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించుకోవాలని సూచించారు. తమకు అన్యాయం జరుగుతుందని తమ పూర్వీకుల సమాధులను తొలగించి రోడ్డు వేసే ప్రయత్నం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానం వెనుక నుంచి కోలమూరు వరకు ఆక్వాచెరువులకు రోడ్డు ఉండగా నేరుగా ప్రధాన రహదారి వెళ్లిపోవాలని కొందరు ఆక్వారైతుల కోరిక మేరకు శ్మశానంలో నుంచి రోడ్డు వేయడం ఎంత వరకు సమంజసం? అని దళితులు ప్రశ్నిస్తున్నారు. తమ పూర్వీకుల సమాధులను పోగొట్టుకునే పరిస్థితుల్లో తాము లేమని కాదని రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తే తాము మరింతగా నిరసనకు దిగుతాము వారు తెలిపారు. ఈ ఆందోళనపై తహసీల్దార్ స్పందిస్తూ శనివారం వచ్చి సమస్య పరిష్కరిస్తానని ఫోన్‌లో హామీ ఇవ్వడంతో దళితులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో దానం విద్యాసాగర్, దర్శి మాకయ్య, మామిడిపల్లి యేసేబు, అనిపే నాగేశ్వరరావు, దర్శి సాల్మన్, దర్శి సంతోషమ్మ, మత్తి మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

భీమవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని అడిషనల్ ఎస్పీ వి భీమారావు అన్నారు. గురువారం ప్లాస్టిక్ నిషేధ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధ పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ ఉత్పత్తులపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని, ప్లాస్టిక్ వినియోగం విడనాడి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, టీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర పేరుతో కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ దేశంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తగదు

భీమవరం: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసేంతవరకు ఆందోళన, పోరాటాలు కొనసాగిస్తామని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. గురువారం భీమవరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రచార యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం వైకుంఠరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి నాయకులు నేడు వాటిని ఎందుకు సమర్థిస్తున్నారో ప్రజలకు స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ట్రూ అప్ చార్జీలు ఇంధన చార్జీలు సర్దుబాటు వంటి రకరకాల పేర్లతో ప్రజలపై మోయలేని విద్యుత్ భారాలు వేసి మళ్లీ స్మార్ట్ మీటర్లని తీసుకురావడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకుడు కె.మహంకాళి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే ప్రమాదాన్ని ప్రజలకు తెలియజేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచార యాత్ర చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఎం మంగతాయారు, రేణుక, అనసూయమ్మ, వేండ్ర నర్సమ్మ సత్తమ్మ, సీహెచ్ దుర్గ పాల్గొన్నారు.

బెల్టు షాపులు తొలగించే వరకు ఉద్యమం

పెనుమంట్ర: గ్రామాల్లో బెల్టు షాపులు తొలగించే వరకు గీత కార్మికుల పోరాటం ఆగదని ఆంధ్ర ప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి అన్నారు. గురువారం పెనుమంట్రలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కామన మునిస్వామి మాట్లాడుతూ జిల్లాలో ఐదు వేల బెల్ట్ షాపులు ఉన్నాయని వాటిని అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. బెల్టు షాపుల వల్ల గీత కార్మికుల కల్లు అమ్ముడుకాకపోవడంతో పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని బెల్ట్ షాపులు ఉంటే బెల్ట్ తీస్తామని ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఆదరణ పథకం పేరుతో గీత కార్మికులను ఆదుకుంటామని చెప్పినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.

మానవత్వంతో జీవించాలి



పౌరహక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు

ఆకివీడు: ప్రజలంతా మానవత్వంతో జీవించాలని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామ సచివాలయం వద్ద పౌరహక్కుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకతీతంగా అందరూ సమానమనే భావనలో జీవించాలని సూచించారు. గ్రామంలోని అన్ని కార్యక్రమాలకూ ప్రజలంతా హాజరై సహపంక్తి భోజనాలు చేసే విధంగా కృషి చేయాలన్నారు. సర్పంచ్ నందమూరి ప్రకాశం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ఐ వంటపాటి ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా ఇవ్వకపోతే చర్యలు

స్థానికంగా పలు వార్డుల్లో రేషన్ సరుకులు సక్రమంగా సరఫరా చేయడంలేదని వస్తున్న ఫిర్యాదులపై గురువారం తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఎఎస్ఓ తనిఖీలు చేశారు. స్థానిక 29, 30, 31 నంబర్ల రేషన్ షాపులను తనిఖీ చేశారు. వినియోగదారులను సంప్రదించి రేషన్ అమ్మకాలు, డీలర్ ప్రవర్తనపై ఆరా తీశారు. రేషన్ సక్రమంగా ఇవ్వకపోయినా, వినియోగదారులపై చిరాకు పడినా, దివ్యాంగులకు రేషన్ ఇంటికి తీసుకువెళ్లి ఇవ్వకపోయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ వంటపాటి ఆంజనేయులు, వీఆర్ఓ దానయ్య, ఏఎస్ఓ లక్ష్మి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గూట్లపాడు గ్రామానికి చెందిన మోకా దాసుబాబు (57) కుటుంబ ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఈనెల 17 ఇంటి సమీపంలో చెట్టుకు నైలాన్ తాడుతో ఉరిపోసుకున్నాడు. స్థానికులు గమనించి నైలాన్ తాడును కోసి దాసుబాబును భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ నెల 24న మెరుగైన వైద్యం కోసం దాసుబాబును విజయవాడ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దాసుబాబు గురువారం మృతి చెందాడు. ఆయన కుమారుడు ప్రసాద్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ వెంకట రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన లారీ

ఉండి: ఉండి శివారు పాముపలపర్రుకు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. పాములపర్రు వైపు నుంచి ఉండి వైపుగా వస్తున్న బాక్స్ లారీ అదే వైపున ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టడంతో దానిలో ఉన్న ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. దీంతో క్షతగాత్రులను భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడవారు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు.